
అచ్చతెనిధి అమృత హస్తం.

దక్షిణం వేపెళ్ళిపోతున్న దిగువ గోదారి కాస్త దూరంగా ఉన్న యానాం వెళ్ళి అక్కడ్నించి గాడిమొగ దగ్గర సముద్రంలో కల్సిపోతుంది. ఈ ఒడ్డున నిలబడి చూస్తుంటే రెల్లుపాకల్తో అందంగా అగపడే ఆ ముక్తేశ్వరం ఒడ్డు. అక్కడ కిళ్ళీకొట్లూ తాటాకు పాకలూ "ముక్తేశ్వరం ముక్తేశ్వరం" అనరిచే జట్కావాళ్ళ అరుపులూ వినడానికి భలేగున్నాయి. ఒంద్రుమట్టి లంకల్లో ఏపుగా పెరిగిన పెసర, మినుము చేలు గాలికి గమ్మత్తుగా ఊగుతున్నాయి. ఇంకో పక్కన పుచ్చపాదులు పెద్ద పెద్ద కాయలు దింపేసినియ్యి. కచ్చాలు పోసుకుని కలుపు తీస్తున్న ఆడోళ్ళు అలుపు మర్చిపోడానికి ఊడుపులప్పుడు  దంపుళ్ళప్పుడు పాడే పాటలూ తిరగేసి మరగేసి పాడుకుంటున్నారు.

జనాన్ని నిండా ఎక్కించుకున్న నావలూ, పడవలూ, లాంచీ ఆ ఒడ్డునించి ఈ ఒడ్డుకీ, ఈ ఒడ్డునించి ఆ ఒడ్డుకీ తెగ తిరుగుతున్నాయి. కొబ్బరినౌజూ, పెసరపొణుకులూ అమ్ముకుంటున్న పిల్లలు నావల్లో కల తిరుగుతున్నారు.

ఒడ్డునున్న ముసలి రావిచెట్టు పాదాల్ని సుతిమెత్తగా కడుగుతుంది చల్లని గోదారితల్లి. ఆ చెట్టుని ఆన్చి ఉంది రెల్లుగడ్డితో నేసిన ఆ అందమైన పాక. అదెంత సుబ్బరంగా వుందంటే ఆ పాకలో ఏమూలైనా రుమాలుతో దులుపుకోకుండా కునుకుతియ్యొచ్చు. అది అచ్యుతం కాఫీ ఒటేలు పాక. ఆ పాకనీ ఆ రేవునీ దాటుకుంటా గోదారి ఒడ్డుకి దిగిపోయి ఉత్తరం వేపెళ్ళిపోతే కనిపిస్తది అందమైన కోటిపిల్లి వూరు.


* * *

తెల్లవారుఝాము.

మంచు బాగా పట్టుంది.

చలిగాలి వీస్తుంది.

కోటిపల్లేశ్వరస్వామి గుళ్ళో గంటలు గోదారి మధ్యలోంచెళ్ళే లాంచీ హారను మోత కలగలిసి వినిపిస్తున్నాయి.



నులకమంచం మీంచి మెల్లగా లేచిన అచ్యుతం వేపపుల్లతో పళ్ళు తోమి గబగబా తక్కిన పన్లన్నీ కానిచ్చి గోదాట్లో మునిగొచ్చేకా రాత్రి నాన బోసిన కుంచెడు పెసల్నీ అల్లం ముక్కేసి మెరుగ్గా మూడు వాయలుగా రుబ్బు తుండగానే వచ్చాగింది జట్కాబండి. దాంట్లోంచి దిగిన సెక్కంటి బుల్లియ్యచౌదరి అలవాటు ప్రకారం ముక్కాలిపీట లాక్కుని కూర్చున్నాడు.

పిండిరుబ్బడం అయ్యేకా వుల్లిపాయల ముక్కలూ పచ్చిమిరపకాయముక్కలూ సన్నగా తరుక్కుని పొయ్యి వెలిగించి పేనం పెట్టేడు. కాస్సేపటికే నీళ్ళ చుక్కలు జల్లితే చుఁయ్యమంది పేనం. అప్పుడు నెయ్యి దానిమీదేసి గిన్నెడు పెసర పిండేసేకా కాళీ గిన్నె తిరగేసి వయ్యారంగా అట్టులా తిప్పేడు పిండిని. ఆ తర్వాత జీలకర్ర పచ్చి మిరపకాయలూ, ఉల్లిపాయముక్కలూ జల్లి అట్టుసుతలు దోరగా కాలేకా అట్లకాడతో మాంచి ఒడుపుగా ఆ పక్కకి తిప్పేకా టకాల్మని లాగేడు లేత అరిటాకు ముక్కలోకి. అరిటాకు రసాన్ని వేడి అట్టు లాక్కోడంతో అట్టు రుచి పెరుగుద్దట.

మొట్ట మొదటి అట్టుని సెక్కంటి బుల్లియ్యచౌదరి కిచ్చేడు. అలా మొదటి అట్టు ఆ చౌదరిగారికివ్వడం ఎన్నో ఏళ్ళనుంచి జరుగుతా వస్తుంది.

ఇక మొదలైన జనాన్ని తట్టుకుంటా ఒకపక్కనుంచి పెసరెట్లేస్తానే, ఉప్మామూకుడు పెట్టేడు, ఇడ్లీపాత్ర ఎక్కించేడు.

కేష్ సొరుగు దగ్గర కూర్చున్న బుల్లియ్యచౌదరి గోదారి మంచులో వెళ్తావస్తా వున్న నావల్ని లాంచీల్ని చూస్తా అచ్యుతం ఒట్టేల్లో ఆవురావురు మంటూ తింటున్న జనం దగ్గర డబ్బులు తీసుకుని ఆ సొరుగులో వేస్తా మధ్యమధ్యలో ఓ పెసరట్టు, నేతిలో ముంచిన ఇడ్లీ లాగుతున్నాడు.

చల్దిపొద్దుదాటేలోపే అచ్యుతం హొటలు మూసేస్తుండగా ఆవేళ తను తిన్నదానికి డబ్బులు లెక్కగట్టి కేష్‌సొరుగులో వేసేసి జట్కా ఎక్కిన చౌదరి ''రేపొద్దుటొస్తా నొరేయ్... మరి దిగడతానే'' అని జెప్పి బయల్దేరిపోయేడు వాళ్ళవూరు గంగవరం.

ఓ పక్కనించి హొటేలు మూసేసినా కదలకండా నిలబడున్నారు ముగ్గురుమనుషులు. వాళ్ళెవరంటే, పెళ్ళిళ్ళకి వంటలు చెయ్యమని అడగడానికి పొనేపిల్లినించీ, వెంటూరు నించీ, రాయవరానికి ముందొచ్చే లొల్లనించీ రాంపురం తర్వాత వచ్చే వెల్లనించీ వచ్చిన జనం. వాళ్ళందరి వెనకాల నిలబడ్డ ఒక బక్క పల్చటి మనిషి దగ్గరకెళ్ళి ''ఏంటి ఏ పని మీదొచ్చేరు?'' అన్నాడు అచ్యుతం.

''మా ఊరి పేరు కొత్తకొంపలు'' అన్నాడామనిషి.

''తెల్సు ఈ గోదారి గట్టుమీంచి తిన్నగా ఎళితే ఎడం పక్క తగులుద్ది గదా వూరు?'' అన్నాడు అచ్యుతం.

''అవును...రేపు రాత్రికి మా అమ్మాయి పెళ్ళి. నువ్వొచ్చి వంటలు చేసి పెట్టాలి. పెద్దగా ఇచ్చుకోలేను మరి'' అన్నాడా మనిషి.

''సర్లే... సర్లే'' అనేసేడు అచ్యుతం.

అక్కడే నిలబడ్డ లొల్లమనిషి ''నీకెంత కావాలంటే అంతిస్తాం. ఇది పెద్ద కమ్మోరింట్లో పెళ్ళి'' అన్నాడు.

''ఆ కొత్తకొంపలు మనిషికూడా వెళ్ళడానికి ఒప్పేసుకున్నాను మరి''అనేసి తప్పించుకున్నాడు అచ్యుతం.

* * *

వరదలొచ్చినప్పుడు పైనించి కిందికి కొట్టుకొచ్చిన ఇసక ఒడిలేని చోటల్లా ఆగిపోడంతో మేటలు వేస్తాయి. ఆ మేటల్ని పాట పెడతారు గవర్నమెంటోళ్ళు. ఆ ప్రాంతాల్ని ఇసకరేంప్ లంటారు. ప్రతి ఏడాది పాటల్లో ముందు నిలబడిపోయి ఎక్కువ రేటుకి పాడి తక్కిన

కాం(ట్రాక్టర్లందరి కంటే ఎక్కువ సంపాయించే యర్రంశెట్టి వెంకన్నబాబుకి ఒకే ఒక దురలవాటుంది. అదేంటంటే...చక్కటి భోజనం చెయ్యడం.

యానాం పక్కనున్న నీలపల్లిలో రామాలయంపూజారి అయోధ్యరామాచారి గారింట్లో పులిహోర బ్రహ్మాండంగా చేస్తారు. ఇంత డబ్బున్న వెంకన్నబాబు పని గట్టుకుని ఆవూరెళ్ళి వాళ్ళని బతిమాలి మరీ చేయించుకు తెచ్చుకుంటాడు పులిహోరా. అలాగే రాజోలికి ముందు తగిలే పొదలాడలో ఎమ్మెస్ సూర్యనారాయణగారి భార్య పప్పుపులుసు అమ్మో అమృతంలాగ కాస్తాదావిడ అప్పుడప్పుడెళ్ళి వార్ని బతిమాలి కాయించుకుని తినేసొస్తుంటాడు. కోలంకలో కోమట్లు వరదా బంగారులక్ష్మిగారి రేగుపళ్ళ వడియాలు, ద్రాక్షారామంలో క్రిష్ణవేణిగారు పాలు కలిపి వేసే కోడిగుడ్డు అట్టూ, ఉమాగౌరీగారింట్లో కోడిమాంసం ఇగురూ ఇలాగ అందరిళ్ళకీ పని గట్టుకు వెళ్ళి బతిమాలి బామాలి వండించుకుని మరీ తెచ్చుకుంటాడు వెంకన్న బాబు.

మధ్యాన్నం రెండు దాటింది. దూరంగా ఉన్న ఇసక రేంప్‌లోంచి నడిచొచ్చిన వెంకన్నబాబుకి చాలా ఆకలేస్తుంది.

చెమట్లు కక్కుతా వచ్చి అచ్యుతం పాకలో కూర్చున్న వెంకన్నబాబు కేరేజీ తెచ్చిన జట్కాబండోడ్ని ''గిన్నెలు విప్పరా'' అన్నాడు.

కోడిమాంసం వేపుడు, పీతలపులుసు, మామిడికాయ సెత్తళ్ళూ ఇగురుకూరా, కొబ్బరీ చింతకాయా పచ్చడి, పప్పుచారూ చల్ల మిరపకాయలూ, ముంత పెరుగు, వాటిని చూస్తున్న వెంకన్నబాబులో ఆకలి బాగా పెరిగిపోయింది.

ఈలోగా రోజా పెసరెట్లేసే గిన్నిలో పచ్చడేసుకొచ్చిన అచ్యుతం ''ఇది కొంచెం రుచి చూడండి'' అన్నాడు.

''సరే'' అనేసి అన్నంలో ఆ పచ్చడి కలుపుకుని ముద్ద నోట్లో పెట్టుకున్న వెంకన్నబాబు ''ఆహా అమృతం రా అచ్యుతం'' అన్నాడు.

నవ్వేడు అచ్యుతం.

అర్థంగాని వెంకన్నబాబు ఎందుకునవ్వుతున్నావన్నాడు.

మళ్ళీ నవ్వేడు.

''ఏంటంటే చెప్పకండా ఆ నవ్వేంట్రా బాబూ చెప్పూ'' అన్నాడు.

మళ్ళీ నవ్విన అచ్యుతం అలా ఓ పుంజీడు సార్లు వెంకన్నబాబుతో అడిగించుకుని అప్పుడు జెప్పేడు ''అది లేత గరికల పచ్చడి వెంకన్నబాబుగారూ'' అని.

''గరికలంటే... పచ్చగడ్డీ... పచ్చగడ్డి గడ్డి పచ్చడా ఇది?''.

''అవునండి''.

''ఏంటీ ఆవులూ గేదెలూ తినే పచ్చగడ్డి???''.

''చిత్తం మీరు తింటున్నది పచ్చగడ్డి పచ్చడండి''.

పచ్చగడ్డి పచ్చడి ఇంతరుచిగా చేశేవా. మాటపడిపోయింది వెంకన్నబాబుకి.

* * *

ఉప్పొంగలలో రామబద్రిరాజుగారబ్బాయి సత్యసాయివర్మ పెళ్ళి తిళ్ళకుప్ప వాళ్ళమ్మాయితో జరుగుతుంది.

పత్తిపాడు నుంచి వచ్చిన బద్ధిరాజు బావగారయిన మందపాటి వెంకటపతిరాజుగారు ''మరి పెళ్ళికి వంటలు ఎవరితో చేయిస్తావురా?'' అనడిగేడు బామ్మర్ది బద్ధిరాజుని.

''కోటిపల్లిలో అచ్యుతాన్ని పిలుద్దామనుకుంటున్నాను'' అన్నాడు బద్ధిరాజు.

''బానే వండుతాడా?''

''బాగుంటాయని చెప్పుకుంటారు'' అన్నాడు బద్ధిరాజు.

నవ్వేసిన దత్తుడు సుబ్బరాజుగారు ''మీ బావగారు చెయ్యి చేసుకొని పలావుగానీ వండితే బోర్లాపడి పోగలడు ఆ అచ్యుతం'' అని వెంకటపతిరాజు వేపు తిరిగి ''నిన్ను పొగడ్డం కాదు ఉన్న మాటే. నీ పలావు తిని చాన్నాళ్ళయింది మావ్యా. రేపు పెళ్లికి వండకూడదూ?''అని బతిమాలేడు.

''సరే అలాగే''అన్న వెంకటపతిరాజు బామ్మర్దయిన బద్ధిరాజుతో ''సరే మామూలు వంటలు ఆ అచ్యుతంతో వండించరా... పలావు మట్టుకి స్పెషల్‌గా నేను చేస్తాను'' అన్నాడు.

వెంకటపతిరాజుగారి పలావు రుచి గురించి విన్న చాలా మంది జనం ''ఆవేళమనకి పండగే'' అనుకున్నారు.

పెళ్ళిరోజు వచ్చింది.

బాదంపప్పు, జీడిపలుకులూ, మెరుకులూ, ఉడకేసిన కోడిగుడ్లూ పెట్టి పందెం కోళ్ళని పెంచే కోలంకలో వాత్సవాయి చంటిబాబుగారి దగ్గరకెళ్ళి ఓ అరడజను పందెంకోళ్ళు కొనుక్కొచ్చిన వెంకటపతిరాజు పనిగట్టుకుని మరీ కాకినాడ వెళ్ళి పలావు ఆకూ, నెయ్యీ, మసాలాసామాన్లూ, బాసుమతి బియ్యం, కొనుక్కొచ్చి చాలా శ్రద్ధతో చింతనిప్పుల మీద వండిన పలావు అందరికీ వడ్డించారు. దాంతో బాటు అచ్యుతం సాదాగా వండిన పచ్చడీ, కూరలూ పప్పుచారూ కూడా వడ్డించేరు.

విచిత్రం.!!!

ఎప్పట్నుంచో ఎదురుచూస్తున్న వెంకటపతిరాజుగారు పలావు వదిలేసి అచ్యుతం వంటల్ని పిసరంత కూడా మిగల్చకండా అరిటాకంతా ఊర్చేసేరంతా.

విస్తుపోయిన వెంకటపతిరాజుగారు ''ఏంటా వంటల మహత్యం'' అని తనుకూడా రుచి చూసాడు. నిజమే అచ్యుతం వంటల ముందు తన పలావు ఎందుకు పనికిరాదు అనిపించింది.

మసి పాత కట్టుకుని గాడిపొయ్యి దగ్గరేదో కలబెడ్తున్న అచ్యుతం దగ్గరకెళ్ళిన మందపాటి వెంకటపతిరాజుగారు తన మెడలో వున్న పులిగోరు పతకం తీసి అచ్యుతం మెళ్ళో వేసేసి నిగర్వంగా నిలబడి ''నీ చేతులు మామూలు చేతులు కావు'' అని దణ్ణం పెట్టేసేడు.

* * *

చాలా ఏళ్ళు గడిచినియ్యి.

పగలంతా పనిచేసి పొద్దోయేకా ఓ సీసాకాయ సారా పుచ్చుకునే అలవాటున్న అచ్యుతానికి అరవైఏళ్ళు దాటిపోయినియ్యి.

ఒకరోజు అకస్మాత్తుగా వీపు భాగాన వెన్నుపూసలో తేడా రావడంతో అచ్యుతం రెండు చేతులూ పడిపోయినియ్యి.

అయినా అతని డిమాండ్ ఏమాత్రం తగ్గలేదు. వంటలకి రిక్షాలోనో జట్కా బండిమీదో తీసుకెళ్ళిపోతున్నారు జనం.

ఒకమూల కూర్చున్న అచ్యుతం ఉప్పు ఇంత వెయ్యండి. కారం ఇంత మసాలా ఇంత వెయ్యండి గరిటితో ఇన్నిసార్లు తిప్పండి ఇలా కలబెట్టండి..పోపు ఇలా గిల్లండి అనేసి ఇలా నోటితో చెపుతున్నాడు అసిస్టెంట్లకి.

ఆ వంటల్ని తిన్నోళ్ళంతా ''అచ్యుతం వంటలు అద్భుతం'' అంటున్నారు.

అచ్యుతం మట్టుకి ఏమాత్రం... ఏమాత్రం తృప్తి పడ్డం లేదా వంటలకి.

ఉప్పూకారం నాచేత్తోనే వెయ్యాలి. అప్పుడే పాళ్ళు సరిగ్గా పడతాయి. పులుసు నాచేత్తోనే కలబెట్టాలి. పోపు నా చేత్తోనే పెట్టాలి. నా చేత్తోనే ఒండాలి నా చేత్తోనే వార్చాలి. అప్పుడే అసలు రుచి. ఇలా నోటితో చెప్పిచేయించే వంటలు వంటలు కాదు... అచ్యుతం వంటలు అసలు కాదు... అసలిలా చేయించడం నేరం... పాపం చేస్తున్నాను...నా వృత్తికి నేను ద్రోహం చేసుకుంటున్నాను. అని తనలో తనే చాలా రాత్రుళ్ళు బాధపడ్డ అచ్యుతం ఒకరోజు పొద్దుట ఈ రకం పనికి శాశ్వితంగా శెలవుపెట్టేసి తన చేతులు పని చెయ్యవు గాబట్టి పెట్టీపరుపూ పక్కనున్న సెక్కంటి బుల్లియ్యచౌదరిగారితో చుట్టించుకుని కూతురు ఎర్రయమ్మ ఉంటున్న మా పసలపూడి వచ్చేసేడు.

* * *